

సాక్షి
బాపట్ల
బుధవారం । 25 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.7200 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 4200 క్యూసెక్కులు వదులుతున్నారు.



కృష్ణా డెల్టాకు 2216 క్యూసెక్కులు

తాడేపల్లి రూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2216 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. కొమ్మమూరు కాలువకు 1231 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

రేపు ఇంద్రకీలాద్రిపై శ్రీపంచమి వేడుకలు

- సరస్వతిదేవిగా దుర్గమ్మ దర్శనం
- విద్యార్థులకు పెన్నుల పంపిణీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఈ నెల 26వ తేదీ మాఘ శుద్ధపంచమి(శ్రీపంచమి)ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీ పంచమి నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ మూర్తిని సరస్వతిదేవి అలంకారంలో దర్శించుకునే భాగ్యం భక్తులకు, విద్యార్థులకు కలగనుంది. వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని, పోటీ పరీక్షలలో నెగ్గి కోరుకున్న సీటు లభించాలని కాంక్షిస్తూ అమ్మవారి పాదాల వద్ద ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను శ్రీపంచమి రోజున పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను దేవస్థానం పూర్తి చేసింది. కనకదుర్గనగర్ నుంచి కొండపైకి చేరుకునేలా దేవస్థానం క్యూలైన్లు ఏర్పాటు చేసింది. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవ మూర్తిని దర్శించుకున్న విద్యార్థులందరికీ పెన్ను, అమ్మవారి పాకెట్ సైజ్ ఫొటో, కుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా స్కూల్, కాలేజీ యూనిఫాంను, ఐడీ కార్డును తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని ఆలయ అధికారులు సూచిస్తున్నారు. 26వ తేదీ రిపబ్లిక్ డే నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలకు సెలవు కావడంతో పెద్దఎత్తున విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 40 వేల పైబడి విద్యార్థులు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉందని, ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పించండి

నరసరావుపేట: ప్రభుత్వ పెన్షన్‌దారులందరూ ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని జిల్లా ఖజానా, లేఖల అధికారి వి.స్వామినాథన్ మంగళవారం కోరారు. లైఫ్ సర్టిఫికెట్‌ను జీవన ప్రమాణ యాప్, ఖజానా కార్యాలయం, పెన్షన్ అసోసియేషన్‌లో, మీసేవ లేదా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా సమర్పించవచ్చన్నారు. వేలిముద్రల సమస్య ఉన్న వారు నేరుగా ఖజానా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రెండు పెన్షన్లు పొందేవారు, కుటుంబ పెన్షన్, జీఓ 315 ప్రకారం పెన్షన పొందేవారు తగిన సర్టిఫికెట్లతో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. పెన్షన్‌దారులందరూ తమ ఆధార్ ఆధారిత మొబైల్ నంబరు హెర్బ్ పోర్టల్‌లో నమోదు చేయుట ద్వారా ఈకేవైసీని పూర్తి చేయాలని కోరారు. ఈకేవైసీ విషయంలో సంబంధిత ఎస్‌టీఓ కార్యాలయం తగిన సహకారం అందజేస్తుందని చెప్పారు.

కొప్పరావూరు, కంతేరు రైల్వే గేట్ల మూత

తాడికొండ: సబ్‌వేల నిర్మాణం నిమిత్తం తాడికొండ మండలం కంతేరు- పెదకాకాని మండలం కొప్పురావూరు రైల్వే గేట్లను 6 నెలల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తహసీల్దార్ ఫణీంద్ర బాబు తెలిపారు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గమనించి గేటు నంబర్ 7 ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు.

లక్షకు చేరిన మిర్చి బస్తాల రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,05,607 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 88,222 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 61,269 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 570.60 అడుగుల వద్ద ఉంది. ఇది 258.0802 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకి 10,200, ఎడమ కాలువకు 8,367, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 4,494, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 24,861 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సంక్షేమం... అభివృద్ధి

- గ్రామ సచివాలయాల పరిధిలో అభివృద్ధి బాటలు
- రూ.35.87 కోట్లతో 851 పనులు ప్రారంభం
- సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి పథకాలకు ప్రాధాన్యం
- శరవేగంగా సాగుతున్న పనులు
- గడప గడపలో సమస్యలు గుర్తించిన ప్రజాప్రతినిధులు
- అనంతరం ప్రభుత్వానికి నివేదన
- తక్షణమే పనులు ప్రారంభం



గ్రామాల్లో శరవేగంగా జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సంక్షేమానికి తోడు అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. గడిచిన మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచింది. ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని వాటిని సైతం నెరవేర్చింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టింది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఇంటింటికి వెళ్లాలని ఆదేశించింది. ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజలకు చేరుతున్న వివరాలను తెలుసుకోవాలని చెప్పింది. మిగిలిన సమస్యలను గుర్తించాలని ఆదేశించింది. దీంతో ప్రజల వినతి మేరకు గ్రామ సచివాలయాల పరిధిలో మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో సిద్ధమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించిన అభివృద్ధి పనులను వెంటనే ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 477 గ్రామ సచివాలయాలు ఉండగా ఇప్పటివరకు ప్రజాప్రతినిధులు 220 గ్రామ సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో 851 అభివృద్ధి పనులను గుర్తించారు. ఒక్కొక్క సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు పైగా నిధులను ప్రభుత్వం మంజూరుచేసింది. రూ.35.87 కోట్లతో ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. తొలుత 792 అభివృద్ధి పనులకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. రూ.34.41 కోట్లతో ఈ పనులు చేపట్టారు. ఇందులో రూ.29.27 కోట్లతో 706 పనులు వెంటనే మొదలుపెట్టారు. ఇప్పటికే రూ.2.81 కోట్లతో 76 పనులను పూర్తిచేయగా మిగిలిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో మొత్తం పనులు జరుగుతున్నాయి.

ప్రజల ముంగిటకే జగనన్న పాలన

ఓ వైపు సంక్షేమ పథకాలు అందిస్తూనే మరోవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుంది. ఇందులో భాగంగా గడిచిన 100 రోజుల నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంత్రులు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. జిల్లాలో వేమూరు నియోజకవర్గంలో మంత్రి మేరుగ నాగార్జున, రేపల్లె నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బాపట్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, పర్చూరులో పార్టీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్, అద్దంకిలో పార్టీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గడిచిన మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమపథకాలను వివరిస్తున్నారు. వాటి ద్వారా ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని తెలియజేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన ఆవశ్యకతను తెలియజేస్తున్నారు. వీటితో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీరు తదితర అభివృద్ధి పనులను గుర్తించి తక్షణమే వాటిని పూర్తిచేసేలా చర్యలు చేపట్టారు.

జిల్లాలో చేపట్టిన పనుల వివరాలు			
నియోజక వర్గం	గుర్తించిన పనులు	నగదు కోట్లలో	జరుగుతున్న పనులు
వేమూరు	132	5.49	125
రేపల్లె	124	5.58	109
బాపట్ల	186	8.54	160
పర్చూరు	173	7.39	169
అద్దంకి	151	5.79	144
చీరాల	85	3.08	85
మొత్తం	851	35.87	792

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు



ఇప్పటికే ప్రభుత్వం అర్హులైన అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తోంది. గత మూడు నెలలుగా ప్రజాప్రతినిధులు, అధికారులు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల నుంచి ప్రజల వినతులను స్వీకరిస్తున్నారు. వాటిల్లో భాగంగా రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీటి పథకాల అవసరాల కోసం ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయానికి రూ.20 లక్షలకు పైగా మంజూరు చేసింది, జిల్లాలో 851 పనులను మంజూరుచేశారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

– కె.విజయకృష్ణన్, జిల్లా కలెక్టర్, బాపట్ల

అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

రీజనల్ కో ఆర్డినేటర్లు బీద మస్తాన్‌రావు, భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మోపిదేవి



మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

మేదరమెట్ల: రానున్న ఎన్నికల్లో అద్దంకి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయాలని రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ బీద మస్తాన్‌రావు ఉద్ఘాటించారు. మంగళవారం కొరిశపాడు మండలం మేదరమెట్లలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ అద్దంకి సీటును వైఎస్సార్ సీపీ గెలుపొందేలా ప్రతి కార్యకర్త పనిచేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. మరో ముఖ్య అతిథి రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాల ఫలాలను అందజేస్తున్నారని తెలిపారు. ఈ విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇన్‌చార్జిగా ఉన్న బాచిన కృష్ణచైతన్య నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారని అభినందించారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రారంభం

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది కేంద్రాలు
- ఉదయం 7.00 గంటలకే చేరుకున్న విద్యార్థులు



విద్యార్థిని హాల్ టికెట్ తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో ప్రవేశానికై ఉద్దేశించిన జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా జరిగిన పేపర్-1, పేపర్-2 ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. బీఈ, బీటెక్, బీఆర్క్, ప్లానింగ్ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 9,500 మంది విద్యార్థులు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరగనున్న ఆన్‌లైన్ పరీక్షలకు ఆయా తేదీల్లో కేటాయించిన స్లాట్ల ఆధారంగా హాజరుకానున్నారు. పరీక్ష సమయానికి రెండు గంటలు ముందుగా పరీక్ష కేంద్రాలు చేరుకోవాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విధించిన నిబంధనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ కళాశాలలు గుంటూరు నగరంతో పాటు ఆయా ప్రాంతాలకు దూరంగా ఉండటం, విద్యార్థులను ఉదయం 7.00 గంటలకే పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లాల్సి ఉన్న దృష్ట్యా చలి తీవ్రతలోనే తల్లిదండ్రులు కేంద్రాలకు వెళ్లారు.

ప్రతి ఒక్కరూ రాజ్యాంగబద్ధులై ఉండాలి

ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్:సమాజంలోని పౌరులందరూ రాజ్యాంగబద్ధులై ఉండాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పిలుపునిచ్చారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో 'రాజ్యాంగ అక్షరాస్యత' కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ.. నిత్య జీవితంలో రాజ్యాంగ విలువలను ఆచరించాలన్నారు. డాక్టర్ పీసీ సాయిబాబు మాట్లాడుతూ రాజ్యాంగ ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు సమీపిస్తున్నందున రాజ్యాంగ అక్షరాస్యత ఉద్యమాన్ని చేపట్టినట్లు చెప్పారు. బాపట్లను సంపూర్ణ రాజ్యాంగ అక్షరాస్యత కలిగిన జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు.

బాలికలు ఉన్నత లక్ష్యంతో ఎదగాలి

జాతీయ బాలికా దినోత్సవంలో కలెక్టర్ విజయకృష్ణన్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

చీరాల అర్బన్: బాలికలు ఉన్నత లక్ష్యంతో జీవితంలో ఎదగాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. మంగళవారం చీరాలలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్య కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పాఠశాలలో డ్రాప్ ఔట్స్ ఉండకూడదని అధికారులకు సూచించారు. బాలికలు తల్లిదండ్రులను గౌరవిస్తూ క్రమశిక్షణతో ఉండాలని, కష్టపడి చదివి సత్తా నిరూపించుకోవాలన్నారు. ఆత్మాభిమానంతో తమ కాళ్లపై తాము నిలబడి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. 18 ఏళ్లు నిండి స్థిరపడిన తర్వాతనే వివాహాలు చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు పురస్కారాలను అందించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మ, చీరాల ఆర్డీవో పి.సరోజిని, జిల్లా సైన్స్ ఆఫీసర్ సాధిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వే త్వరగా పూర్తిచేయాలి

డీపీవో శంకర్‌నాయక్



మాట్లాడుతున్న డీపీవో శంకర్‌నాయక్

వేటపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో చేపట్టిన స్వమిత్వ సర్వేను త్వరగా పూర్తిచేయాలని బాపట్ల జిల్లా డీపీవో వై శంకర్‌నాయక్ ఆదేశించారు. వేటపాలెం మండల పరిషత్ ప్రాంగణంలో గల ఐసీడీఎస్ సమావేశం హాలులో స్వమిత్వ సర్వేపై జిల్లాస్థాయి సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ సర్వే త్వరగా పూర్తిచేసే విధంగా ఎంపీడీవో చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 40 జీపీల్లో సర్వే జరుగుతోందని తెలిపారు. వీటిల్లో 41,900, ఇల్లు సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. అందులో ఇప్పటి వరకు 35, 249 ఇళ్ల సర్వే పూర్తి చేశామన్నారు. ఇంకా 6,546 ఇళ్లు సర్వే చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ సమయంలో ప్రభుత్వం కొత్తగా ఎస్‌ఓపీ కొత్త నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన తరువాత సంబంధిత ఇంటి యజమానికి అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. సర్వే పూర్తయిన వెంటనే గ్రామాల్లో వారి ఆస్తులకు సంబంధించి ప్రాపర్టీ ఓనర్‌షిప్ కార్డులు అందిస్తారని చెప్పారు. ఇదే విధంగా రెవెన్యూ శాఖ ద్వారా ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి వారి పొలంతో పాటు, ఇంటి స్థలానికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేకుండా పూర్తి హక్కులతో కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకట్రావు, ఎంపీడీవో శర్మ, జిల్లా సర్వేయర్లు శ్రీనివాసరావు, ఈఓఆర్‌డీ శ్రీనివాసరావు, జిల్లాలోని మండల, గ్రామ సచివాలయ సర్వేయర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్నేహితులే దేవుళ్లు



బాల్య స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వేటపాలెం: ఎవరికివారే యమునా తీరే అనే చందంగా సమాజం తీరు ఉంది. ఎన్నో కష్టాలు, మరెన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మనల్ని ఒక్కోసారి బంధుమిత్రులు కూడా ఆదుకోవడం లేదు. అలాంటి సందర్భంలో మేమున్నామంటూ స్నేహితులే ముందుకు వస్తారు. అంత గొప్పది స్నేహం. ప్రస్తుతం ఆధునిక కాలంలో కష్టకాలంలో అయిన వారు దూరమవుతుంటే మేమున్నామంటూ చిన్ననాటి స్నేహితులు ముందుకు వస్తున్నారు. తమతో పాటు చదువుకున్న బాల్యమిత్రుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న వారికి అండగా నిలుస్తున్నారు. బీబీహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల ఔదార్యం ఎందరికో ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. వేటపాలెంలోని బీబీహెచ్ స్కూల్‌కి ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్వాతంత్ర్యం రాకపూర్వం బండ్ల బాపయ్యశెట్టి పవిత్రాశయంతో 1921 నవంబర్ 4న ఈ స్కూల్‌ను స్థాపించారు. బీబీహెచ్ హైస్కూల్లో పదో తరగతి 1998 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సామాజిక సేవ చేస్తు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- కష్టకాలంలో తోటి స్నేహితులకు ఆపన్నహస్తం
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న పూర్వ విద్యార్థులు

సేవలకు అంకురార్పణ ఇలా..

హైస్కూల్లో 1998లో మొత్తం 250 మంది విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకున్నారు. తర్వాత ఉన్నత చదువులు పూర్తి చేసుకుని వేర్వేరు ప్రాంతాల్లో వివిధ రంగాల్లో వీరంతా స్థిరపడ్డారు. తర్వాత కొంత కాలానికి 150 మంది పూర్వ విద్యార్థులు ఒక్కటిగా కలుసుకుని తమ సాధకబాధలు పంచుకున్నారు. ఆ సమయంలోనే వీరంతా కలిసి ఆపదలో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమ చిన్ననాటి స్నేహితులను, వారి కుటుంబ సభ్యులను, అభాగ్యులను ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ వస్తున్నారు. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న స్నేహితులకు ఆర్థికంగా ఆదుకుంటూ వచ్చారు. అనారోగ్యం పాలైన స్నేహితుల కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు.

స్నేహితులకు ఆపన్న హస్తం

- తమతో కలసి పదోతరగతి వరకు చదువుకున్న దేవన కళ్యాణ్ అకాల మరణం చెందగా అతని కుమార్తె పేరుపై రూ.1 లక్ష పోస్టల్‌లో ఫిక్సిడ్ డిపాజిట్ చేశారు.
- చిన్ననాటి స్నేహితుడైన భోగిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో అతని పిల్లల పేర్లపై పోస్టల్‌లో రూ. లక్ష ఫిక్సిడ్ డిపాజిట్ చేసి అందించారు.
- మరొక స్నేహితుడు గుగ్గిలం శ్రీనివాసరావు కరోనా కారణంగా మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించారు.
- ఇంకో స్నేహితుడు దారా జెస్సీకుమార్ అనార్యోగంతో ఆకస్మికంగా మరణించడంతో వారి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహకారం అందిచారు.

ఆపదలో ఉంటే ఆదుకుంటాం..



మా స్నేహితులు ఎవరైనా ఆపదలో ఉన్నారని తెలిస్తే వెంటనే ఏదో ఒక రూపంలో ఆదుకుంటూ వస్తున్నాం. ఆ సమయంలో సామాజిక సేవ చేయాలని అనుకున్నాం. మూడేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడతూ వస్తున్నాం.

– లేళ్ల వీరన్న, పూర్వవిద్యార్థి

చందాలు వేసుకుని ఆర్థికంగా ఆదుకుంటున్నాం..



బయట నుంచి పైసా కుడా వసూలు చేయడం లేదు. మా బ్యాచ్ పూర్వ విద్యార్థులందరం కలిసి చందాలు వేసుకుని సేవా కార్యక్రమాలు చేపడున్నాం. స్నేహితులకు అండగా ఉంటున్నాం.

– షేక్ కరీమ్, వేటపాలెం

గణతంత్ర దినోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు

రిహార్సల్స్‌లో పాల్గొన్న జిల్లా ఎస్పీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. దానిలో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్‌పేరెడ్ గ్రౌండ్‌లో పేరెడ్ రిహార్సల్స్ నిర్వహించారు. అడ్మిన్ ఆర్‌ఐ మన్మధరావు పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. పెరేడ్ కమాండర్ ఎస్పీకి గౌరవ వందనం చేసి కవాతు పరిశీలనకు ఆహ్వానించారు. కవాతు పరిశీలనలో భాగంగా ప్రత్యేక వాహనంలో పర్యటించారు. ఎన్‌సీసీ విద్యార్థుల విన్యాసాలు, పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు కనుల పండుగాగా నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో జిల్లాలోని అధికారులు, పాఠశాలల విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎం.డి.హెచ్ ప్రేమ్‌కుమార్, బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్.మన్మధరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ బి.శ్రీకాంత్‌నాయక్, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాసరావు, బాపట్ల పట్టణ సీఐ పి.కృష్ణయ్య, రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

బలహీనవర్గాలు అభివృద్ధి సాధించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: సమాజంలోని ఒడిదుడుకులను అధిగమించి బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి వైపు పయనించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బడుగు బలహీనవర్గాల ఐక్యవేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో ఐక్యవేదిక జిల్లా స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. తొలుత బంగ్లా సెంటర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే, గుర్రం జాషువా విగ్రహాలకు పూలమాలలు వేసి ఎమ్మెల్సీ జంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ జంగా మాట్లాడుతూ సమాజంలో ఎదిగిన కులాలను విమర్శించడం మానుకొని ఆ కులాలు ఏ విధంగా అభివృద్ధి చెందాయో, అదేవిధంగా బడుగు, బలహీనవర్గాలు అభివృద్ధి చెందేలా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మార్పుతో పాటుగా అట్టడుగు వర్గాల ప్రజలను ఏకం చేసేందుకు ఐక్య వేదిక ఉద్భవించిందని, బలహీనవర్గాల నుంచి నాయకత్వం రావాలన్నారు. నాయకుడిగా ఎదగాలంటే ప్రజల సమస్యలు పరిష్కరించే బుద్ధి కలిగి ఉండాలని, కష్టాల్లో ప్రజలకు అండగా ఉండే వ్యక్తే నాయకుడిగా ఎదిగే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్సీ జంగా చెప్పారు. కుల నిర్మూలన జరిగి బలహీనవర్గాలు సంఘటితం కావాలని, సమసమాజాన్ని స్థాపించి బలహీనవర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, అన్ని రంగాల్లో బలహీనవర్గాలు అభివృద్ధి సాధించాలని కోరారు. ఐక్యవేదిక ద్వారా పల్నాడు ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ, యువకుల ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో యువత చైతన్యవంతులై మార్పు కోసం పాటుపడాలని ఆయన సూచించారు. నడికుడి పారిశ్రామికవాడలో కెమికల్ పరిశ్రమల వల్ల జరుగుతున్న నష్టాలపై ఐక్యవేదిక దృష్టి సారించాలని, ప్రజలకు అండగా ఉండాలని ఎమ్మెల్సీ జంగా తెలిపారు. వైఎస్సార్ హయాంలో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకునేందుకు అవకాశాలు కల్పించారని, ఐక్యవేదికలో అత్యధికులు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులైనని ఆయన తెలిపారు. నూతనంగా నియమితులైన ఐక్య వేదిక కమిటీ సభ్యులకు ఎమ్మెల్సీ జంగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో ఐక్యవేదిక అధ్యక్షుడు నల్ల మోతు రాజు, ఉపాధ్యక్షుడు గాదె రామకృష్ణారావు, కార్యదర్శి షేక్ షరీఫ్, సహాయ కార్యదర్శి నకరికంటి లాల్‌బాషా, కోశాధికారి సాతులూరి రామాంజనేయులు, మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, కార్మిక విభాగం పార్లమెంట్ అధ్యక్షుడు గద్దల వేదమణి, ఐక్యవేదిక పట్టణ అధ్యక్షుడు ముశ్యం వెంకటేశ్వర్లు, నాయకులు బత్తుల వెంకయ్య, పీపీ నరసింహారావు, నాగెండ్ల జయరావు, భూక్యా కల్యాణ్‌నాయక్, బలుగూరి సీతారామయ్య, సైదు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి



బల్లికురవ: పిచ్చి కుక్కల స్వైరవిహారంతో గొర్రెలు చనిపోవటంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఈఘటన మండలంలోని సోమవరప్పాడులో జరిగింది. గ్రామానికి చెందిన గొర్రెల యజమానులు గోరంట్ల సాంబయ్య, వెంకటేశ్వర్లుకు చెందిన 12 గొర్రెలపై సోమవారం రాత్రి కుక్కలు దాడిచేయడంతో మృత్యువాత పడ్డాయి. నెల రోజులుగా గ్రామంలో పిచ్చికుక్కల స్వైరవిహారంతో కొత్త వ్యక్తులు గ్రామంలోకి రావాలన్నా, గ్రామస్తులు బయటకు వెళ్లాలన్నా భయపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు కొండవర్తి సాంబయ్య తెలిపారు. ఒక్కో గొర్రె విలువ రూ.20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తరపున ఆదుకోవాలని బాధితులు కోరారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: ఉపాధిహామీ పథకం నిధుల అనుసంధానంతో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె.విజయకృష్ణన్ ఆదేశించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులపై పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భవనాలను గడువులోగా నిర్మించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు మొదలుకాని ప్రాంతాలలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ పూర్తికాకపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు. బాపట్ల జిల్లాలో నేటికి 29 గ్రామ సచివాలయాల భవనాలు మొదలు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుభరోసా కేంద్రాలు 65, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 80 భవనాల నిర్మాణ పనులు మొదలు కాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. చీరాల పట్టణంలో అధికంగా పెండింగ్‌లో ఉండడంపై ఆరాతీశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవడం, నీరు నిల్వ ఉండడం, వివాదస్పదంగా ఉన్న భూముల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇసుక, సిమెంటు, ఇనుము వంటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న పనులన్నింటికీ బిల్లులు తక్షణమే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. మండలాలవారీగా ఆమె సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు గడువులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో మంజూరైన 10 అభివృద్ధి పనులకు రూ.1.90 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటివరకు రెండు పనులు పూర్తికాగా, ఆరు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన రెండు ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. పర్చూరులో రూ.22 లక్షల నిధులతో చేపట్టిన 22 పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చీరాల నియోజకవర్గంలో రూ.46.4 లక్షల నిధులతో చేపట్టిన 14 పనుల పురోగతిపై ఆరాతీశారు. మిగిలిన నియోజకవర్గాలలో మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. పురోగతి లేని 13 పనులకు సంబంధించి గుత్తేదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కింద మంజూరైన 469 పనులను ఇంజినీరింగ్ అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు 240 పనులు మాత్రమే పురోగతిలో ఉండగా మిగిలిన పనుల జాప్యంపై ఆరాతీశారు. నిర్మాణ పనులలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే ప్రభుత్వానికి పంపాలన్నారు. ప్రభుత్వం ఒప్పందం మేరకు గుత్తేదారులు పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాసులు, డీఈలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం

బాపట్ల ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్ కుమార్



ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను మరో పది సంవత్సరాలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షణీయమని బాపట్ల ఎంపీ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు నందిగం సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

2013 జనవరి 23న మొదలైన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం ఈ నెల 23తో ముగిసిందని, కానీ రద్దు కాకుండా ముందుగానే గవర్నర్ ఆమోదంతో ఆర్డినెన్స్ తీసుకురావడం ఎస్సీ, ఎస్టీలు వరంగా భావించాలన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా సబ్‌ప్లాన్ గడువును పెంచి అగ్రగామిగా నిలిపిన జగనన్న ఎస్సీ, ఎస్టీలపై తనకున్న ప్రేమను చాటుకున్నారన్నారు. సబ్‌ప్లాన్ నిధుల ద్వారా ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు సాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పట్టణ పేదలను ఆదుకోవడం, ఎస్సీల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్‌లు జారీ చేయడం వంటి పనులను కేంద్రం మెచ్చుకుందన్నారు. ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని 22 రాష్ట్రాల్లో మొత్తం 29.84 లక్షల ఎస్సీ కుటుంబాలకు సాయం అందించగా, అందులో 29.10 లక్షల ఎస్సీ కుటుంబాలు మన ఏపీలో సాయం పొందడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలో 6.15 లక్షల ఎస్సీ విద్యార్థులకు సబ్‌ప్లాన్‌లో స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ప్రభుత్వం, సబ్‌ప్లాన్ కింద 1,38,245 ఇళ్ల నిర్మాణం చేయడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

పాడిపరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

యద్దనపూడి: పాడిపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బాపట్ల జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పోలూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా ఆర్బీకే కేంద్రాల పరిధిలో సిబ్బందిని ఏర్పాటుచేసి పశువులకు సేవ అందిస్తోందని చెప్పారు. ఆసుపత్రికి రాలేని స్థితిలో ఉండే పశువులకు సైతం మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో సంచార పశువైద్యశాలలను అందుబాటులోకి తెచ్చిందని పేర్కొన్నారు. పశువులు అకస్మాత్తుగా ఇబ్బందులకు గురైనప్పుడు 1962 కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి ఉచిత పశు అంబులెన్స్ సేవలను వినియోగించుకోవచ్చని సూచించారు. అనంతరం పశువులు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులు, నివారణ, సమీకృతదాణ, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి బి.సురేష్, పోలూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ భవానీ, పశువైద్య సిబ్బంది వీరాస్వామి, ఉదయ్, స్థానిక పశుపోషకులు పాల్గొన్నారు.

భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ



బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీటీవో చంద్రశేఖరరెడ్డి

చీరాల: భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని డీటీవో ఎ.చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు మంగళవారం చీరాల మసీద్ సెంటర్‌లో నిర్వహించిన బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 216 జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వాటిని అరికట్టేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి హైవే పైకి వచ్చే వారు రహదారిపై ఇరువైపులా వాహనాలను గమనించాలన్నారు. పలు ప్రాంతాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. రహదారులపై ప్రమాద ఘటనలు జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడాలని, 108కు సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో చీరాల ఎంవీఐ బి.రామకృష్ణారెడ్డి, బాపట్ల ఎంవీఐ ప్రసన్నకుమారి, ఏఎంవీఐ అంకమ్మరావు, చీరాల ఒన్‌టౌన్ ఎస్సై అహ్మద్‌జానీ, రవాణాశాఖ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బేల్దారి మేస్త్రి మృతి

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆమంచి



గోపి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుంటున్న ఆమంచి

మార్టూరు: ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో బేల్దారి మేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటన మార్టూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన గుంజి గోపి (28) బేల్దారి మేస్త్రిగా జీవనం సాగిస్తుంటాడు. మార్టూరులోని జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇంటిపైకి ఇనుప చువ్వలు తీసుకువెళ్తుండగా ప్రమాదవశాత్తూ చువ్వలు విద్యుత్ లైన్‌కు తగలటంతో విద్యుదాఘాతానికి గురై ఇంటిపై నుంచి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆటోలో మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గోపి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు గోపికి భార్య, ఐదేళ్ల చిన్నారి మణికంఠ, మూడేళ్ల కుమార్తె అమూల్య ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే మార్టూరులో పర్యటిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ ఆసుపత్రికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు చీరాల క్రీడాకారులు



పతకాలు సాధించిన చీరాల తైక్వాండో క్లబ్ క్రీడాకారులు

జిల్లాస్థాయిలో 19 బంగారు, 10 వెండి, 14 బ్రాంజ్ మెడల్స్ కైవసం

చీరాలరూరల్: జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. చీరాల తైక్వాండో క్లబ్ క్రీడాకారులు బంగారు, వెండి, బ్రాంజ్ పతకాలను కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తైక్వాండో చీరాల కోచ్ సయ్యద్ సలావుద్దీన్ మంగళవారం తెలిపారు. 13వ జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ 2023 పోటీలు ఈనెల 23వ తేదీన ప్రకాశం జిల్లా కందుకూరులోని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించారు. పోటీల్లో 52 మంది క్రీడాకారులు పాల్గొనగా 19 మంది బంగారు, 10 వెండి, 14 బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ తెలిపారు. క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కోచ్‌లు వెంకట ప్రసాద్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ విరిగిపడి యువకుడు మృతి

అద్దంకి రూరల్: చెట్టు కొమ్మ విరిగిపడటంతో తీవ్రగాయాలై అక్కడిక్కడే యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. కొరిశపాడు మండలం కొనంకి గ్రామానికి చెందిన అంకమ్మరావు (18) కొన్నాళ్లుగా అద్దంకి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంటు కూలీ పనులకు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామంలోని మిగతా కూలీలతో కలిసి గ్రామంలో చెట్లు కొట్టే పనికి వెళ్లాడు. చెట్టు నరకుతుండగా పైకొమ్మ విరిగి మీద పడటంతో కిందపడ్డాడు. తీవ్ర గాయాలవటంతో అంకమ్మరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోటప్పకొండ తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు

- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్
- తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



కోటప్పకొండ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్‌గోపిరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేటరూరల్: రాష్ట్ర పండుగ హోదాలో నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 18వ తేదీ నిర్వహించే కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై కోటప్పకొండ ఘాట్ రోడ్డులోని పర్యాటక కేంద్రంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, అడిషనల్ ఎస్పీ బిందుమాధవ్, డీఎఫ్‌వో రామచంద్రరావు పాల్గొన్నారు. లక్షలాదిగా తరలివచ్చే యాత్రికుల కోసం గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెండు కమాండ్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నరసరావుపేట నుంచి కోటప్పకొండకు 185 బస్సులు, కొండ కింద నుంచి పైకి 80 బస్సులు, చిలకలూరిపేట నుంచి 120, వినుకొండ నుంచి 35, అద్దంకి నుంచి 25, చీరాల నుంచి 45, ఒంగోలు నుంచి 45 బస్సులను నడపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. కొండ దిగువున రెండు తాత్కాలిక బస్సు స్టేషన్‌లను ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. వీఐపీల కోసం 20 బస్సులను సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. నాలుగు క్యూలైన్‌ల ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకునే అవకాశం కల్పిస్తామని ఆలయ ఈవో వేమూరి గోపి తెలిపారు. భక్తుల కోసం స్వామి వారి ప్రసాదాలు 1.70 లక్షల లడ్డూ, 80 వేల అరిసెలను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లను అందిస్తామన్నారు. కొండదిగువున యాత్రికులకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. తిరునాళ్ల రోజు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. ఐదు జనరేటర్స్, 19 ట్రాన్స్‌ఫార్మర్స్‌తో పాటు 200 మంది సిబ్బందిని విధుల్లో నియమిస్తున్నట్టు తెలిపారు. జాతర జరిగే ప్రాంతంలో తొమ్మిది మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తామని డీఎంఅండ్‌హెచ్‌ఓ తెలిపారు. సమావేశంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ కొండలరావు, జెడ్పీటీసీ పి.చిట్టిబాబు, సర్పంచ్ వెన్నపూస నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

దాదాపు 20 లక్షల మంది తిరునాళ్ల రోజు కోటప్పకొండకు వస్తారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. సామన్య భక్తుల నుంచి వీఐపీల వరకు అందరికీ మంచి దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేయాలి. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ ఏడాది వన్‌వే అమలుచేస్తున్నాం. తిరునాళ్ల రోజు వీఐపీలు వారికి కేటాయించిన బస్సుల్లోనే కొండపైకి రావాలి. ప్రైవేట్ వాహనాలను అనుమతించం.

– డాక్టర్ గోపిరెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే

ట్రాఫిక్ నిర్వహణను చాలెంజ్‌గా తీసుకుంటాం

లక్షలాదిగా భక్తులు తరలివచ్చే తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. భక్తులతో పాటు ప్రభలకు ఎలాంటి అవరోధాలు లేకుండా కొండకు చేరుకుని, తిరిగి వారి గమ్యస్థానాలకు చేరే విధంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆరు రహదారుల నుంచి కొండకు యాత్రికులు చేరుకోవచ్చు. దీంతో పాటు లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

– రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ